సాక్షి అనకాపల్లి

మంగళవారం । 21 । జనవరి । 2025



ఘనంగా ఉర్సు ఉత్సవాలు

మహారాణిపేట: విశాఖ ముస్లిం తాటిచెట్లపాలెంలో హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి.



యోగా మాస్టర్‌కు స్వర్ణ కంకణం

మధురవాడ: యోగా మాస్టర్ వీకేవీకే కళాధరరావు కరీంనగర్‌లో జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు.



ఏయూ విద్యార్థులు ఎంపిక

విశాఖ విద్య: న్యూఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు ఏయూ విద్యార్థులు బుచ్చయ్యనాయుడు, డి.హర్షిత ఎంపికయ్యారు.

న్యూస్‌రీల్

అంతర్జాతీయ ఖోఖో రిఫరీ శ్రీనివాసరావుకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న తుమ్మపాల గ్రామపెద్దలు, ప్రజలు

అనకాపల్లి: న్యూఢిల్లీలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకూ జరిగిన ప్రథమ ఖో-ఖో వరల్డ్ కప్ పోటీల్లో రిఫరీగా వ్యవహరించిన అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన సీహెచ్.ఎల్.ఎం.శ్రీనివాసరావును గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ పోటీలు విజయవంతంగా ముగిసి తిరిగి స్వగ్రామానికి వచ్చిన ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 44 సంవత్సరాలుగా ఖో-ఖో క్రీడలో ఉన్నానని, 18 నేషనల్ ఖో - ఖో టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందామన్నారు. 24 సంవత్సరాలుగా జాతీయ, అంతర్జాతీయ ఖో-ఖో టోర్నమెంట్లలో రిఫరీగా వ్యవహరిస్తున్నానన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన తాను ప్రపంచ టోర్నమెంట్లో రిఫరీగా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. నేటి యువత సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కష్టాన్ని నమ్ముకుని పనిచేసిన ప్రతి వ్యక్తికీ గుర్తింపు ఉంటుందన్నారు.

జీవీఎంసీ కమిషనర్ బదిలీ



విశాఖ సిటీ: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కమిషనర్‌గా ఎవరిని నియమించలేదు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ 2024, జూలై 23వ తేదీన జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఆయన్ని సీడీఎంఏగా ప్రభుత్వం బదిలీ చేసింది.

వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శంకరరావు



నియామక పత్రం అందుకుంటున్న శంకరరావు

దేవరాపల్లి: వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవరాపల్లి మండలం ఎం. అలమండ గ్రామానికి చెందిన పోతల శంకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయ కుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.అనుపమల నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. బుచ్చెయ్యపేట మండల పి.భీమవరం వీఆర్వోగా పని చేస్తున్న శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని వీఆర్వోల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

మృతుని బ్యాంకు ఖాతా నుంచి రూ.12 లక్షల స్వాహా

- ఏటీఎం కార్డు కాజేసి నిధులు డ్రా చేసిన కి'లేడీలు'

ఎస్.రాయవరం: మండలంలోని దార్లపూడి గ్రామానికి చెందిన మృతుడు గారా జోగారావు ఖాతా నుంచి ముగ్గురు మహిళలు రూ. 12 లక్షలు కాజేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ద్వారా అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు మృతుని మనవడు బొల్లం ప్రకాష్‌రావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన ఫిర్యాదు ప్రకారం.. 1980లో పొందిన డీ పట్టా భూమిని గత వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న కాలనీ కోసం 0.60 ఎకరాలు అధికారులు తీసుకున్నారు. ఇందుకుగాను అప్పటి ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 17న 13 లక్షల 90 వేల 400 రూపాయలు జమ చేసింది. అప్పటికే బతికి ఉన్న వృద్ధుడు జోగారావును తన ఇంటికి సమీపంలో ఉంటున్న మహిళ, ఆమె కుమార్తెలు మచ్చిక చేసుకున్నారు. అతని వద్ద ఏటీఎం కార్డును కాజేశారు. ఆ తర్వాత కొన్ని నెలలకే జోగారావు మృతి చెందగా, ఏటీఎం కార్డు ద్వారా దఫ దఫాలుగా రూ.12 లక్షలకు పైగా విత్‌డ్రా చేశారు. ఈ నేపథ్యంలో తమ తాత ఖాతాలో నగదు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, వారసులమైన తమకు నగదు ఇప్పించి న్యాయం చేయాలని ప్రకాష్‌రావు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అయితే జోగారావుకు ఏటీఎం కార్డు ముందే ఉందా? లేదా మహిళలే డబ్బులు కాజేయడానికి పథకం ప్రకారం అతడి వేలిముద్రలు తీసుకుని అప్లై చేశారా? అన్నది తెలియాల్సి ఉంది.

నిరసన హోరు

- ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- కలెక్టరేట్ ముట్టడికి పీఏసీఎస్ ఉద్యోగుల యత్నం
- డోలీ మోతలతో గిరిజనుల వినూత్న నిరసన



కలెక్టరేట్ ముట్టడికి యత్నిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది.. అడ్డుకుంటున్న పోలీసులు



డోలీలు చేతబట్టి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

తుమ్మపాల:

కలెక్టర్ కార్యాలయం సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. నిరసనలతో హోరెత్తింది. అనేక సమస్యలతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పలు రూపాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే తిరుగుతున్నా తమ కష్టాలు తీరడం లేదని వాపోయారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో భారీ ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో జనాన్ని అదుపు చేయడం పోలీసులకు కష్టసాధ్యమైంది. సీఐటీయూ, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పలు సమస్యలపై బాధితులు నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. వినతులతో వచ్చే అర్జీదారులను తప్ప నిరసనకారులను పోలీసులు లోపలకు అనుమతించలేదు. జిల్లా సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగులు కలెక్టరేట్ ముట్టడికి యత్నించడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. కాసేపు ఉద్రిక్త వాతావరణం తాండవించింది.

కదం తొక్కిన వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు

సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ వర్తింపచేస్తామని 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో 36 విడుదల చేసింది. ఆ జీవోను అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలవుతున్నా తమ సమస్యపై స్పందించడం లేదని, సహకార శాఖ మంత్రికి కూడా వినతులు అందించామన్నారు. హామీలు అమలు చేస్తామంటూ ఆశ చూపి కంప్యూటరీకరణ పనులు చేయించారని, డీసీటీ అప్‌లోడ్, ఫ్రీ మైగ్రేషన్ వర్క్ పూర్తి చేయించి తమను పూర్తిగా మోసం చేశారన్నారు. ఈ నెల 9 నుంచి పనులు నిలుపుదల చేసి ఉద్యమం చేస్తున్నా పట్టించుకోవడం లేదని, డిమాండ్లు సాధించే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. గ్రామీణ స్థాయిలో రైతులకు సేవలు అందించే తమకు ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీలు బ్యాంకునకు చెల్లించిన షేరు ధనంపై కనీసం 6 శాతం డివిడెండ్, వడ్డీ చెల్లించాలని, డీసీసీబీలకు 2011–12 ఏడాది నుండి 6 శాతం డివిడెండ్, వడ్డీ చెల్లింపునకు ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేయాలన్నారు. డీసీసీబీలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కొత్తగా వచ్చే రైతులకు, కౌలుదారులకు వ్యవసాయ పంట రుణాలు అందించడం లేదని, పంట రుణాలు కోరిన రైతులందరికీ అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డీసీసీబీల నుంచి నేరుగా రుణాల మంజూరు నిలిపివేయాలన్నారు.

గిరిజనులకు ఎన్నాళ్లీ అవస్థలు..

గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తామని శంకుస్థాపన చేశారు గానీ నేటికీ పనులు ప్రారంభం రాలేదని, అటవీ శాఖ అనుమతులు లేవంటూ రోడ్డు పనులు నిలిపివేయడం దారుణమని ఏజెన్సీవాసులు నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో రావికమతం, గొలుగొండ, మాడుగుల మండలాల నుంచి వచ్చిన గిరిజనులు డోలీ మోతతో వినూత్న నిరసన చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా అధికారులు స్పందించాలని, తక్షణమే అటవీశాఖ అధికారులకు ఆదేశాలు చేయాలని కోరారు. నేరేడుబంద, డొంకాడ గ్రామాల రోడ్డుకు తక్షణమే ఫారెస్ట్ అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించాలని, పశువుల బంద, సోంపురం బంద, జీలుగుల లోవ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్డు మార్గం లేక కొండ శిఖర గ్రామాల్లో ఉన్న ప్రజలు ఊట నీరు తాగడం వల్ల తరచూ అనారోగ్యం పాలై, అనేక జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పీవీటీజీ సంఘం మండల అధ్యక్షుడు కిల్లో పొట్టిదొర, సీదరి కార్యవర్గ సభ్యుడు కె.గోవి కామేశ్వరరావు. సిదరి చిట్టిబాబు పాల్గొన్నారు.

ఖనిజాన్ని కొల్లగొడుతున్నారు..

కొండల్లో ఖనిజాన్ని దోపిడీ చేసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న క్వారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్టూరు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మార్టూరు సర్వే నెం.1 కొండపై కాలుష్య నిబంధనలు ఉల్లంఘించి బ్లాస్టింగ్‌లతో భారీగా రాయి దోపిడీకి పాల్పడుతున్నారని గత ఏడాది నవంబర్‌లో స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈసీ, పొల్యూషన్ బోర్డు అనుమతి లేకుండా కొన్ని, రోడ్డు మెటల్ కోసం అనుమతులు పొంది మరికొన్ని రాయిని తవ్వి తరలిస్తున్నారన్నారు. మైనింగ్ పరిధి కంటే మూడు రెట్లు అధికంగా రాయిని తవ్వి ఎటువంటి మైనింగ్ బిల్లులు లేకుండానే అదనపు రాయి రవాణా చేస్తున్నారని, రసాయనాలు, భారీ యంత్రాలతో భయంకరమైన బాంబ్ బ్లాస్టింగ్ చేస్తున్నారని, గతంలో ఎన్నడూ లేనంతగా మైనింగ్ మాఫియా దోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, బవులవాడ తదితర గ్రామాలు కలుషితమవుతున్నాయన్నారు. ప్రసిద్ధ బుద్ధ క్షేత్రం బొజ్జన్న కొండపై బ్లాస్టింగ్‌ల ప్రభావం పడుతుందన్నారు. సమగ్ర విచారణ జరగాలని, ఆయా గ్రామాల ప్రజలను కాపాడాలని కోరారు.

178 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

పీజీఆర్ఎస్‌లో సోమవారం కలెక్టరేట్‌కు 178 వినతి పత్రాలు వచ్చాయి. కలెక్టర్ విజయ కృష్ణన్, జేసి ఎం. జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి అర్జీల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. అర్జీలు తిరిగి ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అందిన అర్జీల్లో 100కు పైగా రెవెన్యూ (భూమి) సంబంధిత అర్జీలే ఉన్నాయి.

సీనియారిటీ, సిన్సియారిటీకే అందలం

- పార్టీ బలోపేతానికి స్థిరమైన నిర్ణయాలు
- అధిష్టానం ఆదేశమే అందరికీ శిరోధార్యం
- చోడవరం సమన్వయకర్తగా అమర్‌నాథ్‌ను సూచించా..
- గెలిపించే బాధ్యత నా భుజాలపై వేసుకున్నా..
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు కరణం ధర్మశ్రీ



కరణం ధర్మశ్రీని సత్కరిస్తున్న చోడవరం నేతలు

చోడవరం: పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీ విజయావకాశాలు మెరుగుపర్చేందుకు స్థిరమైన, బలమైన నిర్ణయాలు తీసుకోకతప్పదని పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి తమకు చెప్పారని ధర్మశ్రీ తెలిపారు. దీనిలో భాగంగానే అసెంబ్లీ సెగ్మెంట్లు, పార్లమెంటు సెగ్మెంట్ల వారీగా కొన్ని మార్పులు చేపట్టారన్నారు. సీనియారిటీ, సిన్సియారిటీ ఉన్న వారి గురించి జిల్లా నాయకులతో చర్చించిన తర్వాత తనను అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడిగా నియమిస్తున్నామని పార్టీ అధినేత చెప్పడంతో తాను అంగీకారం తెలిపానని ధర్మశ్రీ చెప్పారు. తన స్థానంలో ఎవరైతే బాగుంటుందని అధిష్టానం అడిగినప్పుడు 'ఎవరిని పెట్టినా గెలిపించే బాధ్యత నా భుజాలపై వేసుకుంటాన'ని అధినేతకు చెప్పానన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరును తాను సూచించానని ధర్మశ్రీ చెప్పారు. ఒక్క చోడవరమే కాదని, భీమిలి, గాజువాకతోపాటు పలు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను మార్పు చేశారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు అంతా తనను ఎలాగైతే ఆదరించారో అంతకంటే ఎక్కువగా అమర్‌నాథ్‌ను ఆదరించాలని ధర్మశ్రీ కోరారు.

24న అమర్‌నాథ్ బాధ్యతల స్వీకారం

ఈనెల 24వ తేదీన నియోజకవర్గ సమన్వయకర్తగా అమర్‌నాథ్ బాధ్యతలు స్వీకరిస్తారని, ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయిలో కార్యకర్తలు, నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశామని ధర్మశ్రీ చెప్పారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ సమావేశానికి చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలకి చెందిన పార్టీ కేడర్ అంతా హాజరు కావాలని కోరారు. తాను ఈనెల 30వ తేదీన అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడిగా బాధ్యతలు స్వీకరిస్తానన్నారు. పార్టీయే అందరికీ తొలి ప్రాధాన్యత అని.. పార్టీ కోసం అంతా సమష్టిగా పనిచేయాలని ధర్మశ్రీ కోరారు. పార్లమెంటు పరిశీలకుడిగా నియమితులైన ధర్మశ్రీని ఈ సందర్భంగా పార్టీ నాయకులంతా ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, జెడ్పీటీసీలు మారిశెట్టి విజయశ్రీకాంత్, దొండా రాంబాబు, పోతల లక్ష్మీ శ్రీనివాస్, నాలుగు మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రూ.40 లక్షల విలువైన పశుమాంసం పట్టివేత

- ప్యాకెట్ల రూపంలో 23 వేల కిలోల మాంసం
- పశ్చిమ బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు యత్నం



పోలీసులు పట్టుకున్న పశుమాంసం కంటెయినర్ (ఇన్‌సెట్)ప్యాకెట్లుగా తయారు చేసిన మాంసం

నక్కపల్లి: పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్ నుంచి హైదరాబాద్ తరలిస్తున్న పశుమాంసాన్ని సోమవారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు.. రాణిగంజ్ నుంచి ఐషర్ వ్యాన్‌పై పశుమాంసం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వేంపాడు జంక్షన్‌లో ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేశారు. వ్యాన్ కంటెయినర్ లోపల 1400 ప్యాకెట్లలో రోల్స్‌గా తయారు చేసిన 23 వేల కిలోల పశుమాంసాన్ని గుర్తించారు. ఈపశుమాంసాన్ని రాణిగంజ్ సమీపంలో జల్‌పాయి వద్ద వ్యాన్‌లో లోడ్ చేసినట్లు వ్యాన్ సిబ్బంది తెలిపారన్నారు. పట్టుబడ్డ పశుమాంస విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ నౌసాద్ ఆలీని అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో చినదొడ్డిగల్లు వెటర్నరీ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారన్నారు.


గోవాడ ఫ్యాక్టరీలో నేటి నుంచి రెగ్యులర్ క్రషింగ్

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఈనెల 21న రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు చెప్పారు. మంగళవారం నుంచి రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభమవుతుండటంతో యార్డును శుభ్రం చేయడంతోపాటు చెరకు కాటాలను సిద్ధం చేశారు. ఈ ఏడాది 1.5 లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. పక్వానికి వచ్చిన చెరకు తోటల్లో రసనాణ్యత పరీక్షలు జోరుగా చేయడంతోపాటు చెరకు కటింగ్ పర్మిట్లు కూడా ఫీల్డు సిబ్బంది ద్వారా రైతులకు అందించడం ప్రారంభించామని ఎండీ చెప్పారు.

మనసును కట్టేస్తున్న జనుము

- ఎకరాకు రూ.40 వేల ఆదాయం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- సీడ్స్‌తో ఆయుర్వేద ఆయిల్
- జిల్లాలో సాగుపై రైతుల ఆసక్తి
- రబీలో 10 వేల ఎకరాల్లో పంట

పచ్చని పైరులో పసుపు పూల సోయగంతో ఆకట్టుకునే కట్టె జనుము పంట రైతులకు సిరులు కురిపించడమే కాదు.. నేలను సారవంతం చేస్తోంది. దీని విత్తనాలతో తయారైన ఆయిల్‌తో ఆయిర్వేదంలో మోకాళ్ల నొప్పులకు వినియోగిస్తున్నారు. ఇన్ని ప్రయోజనాలున్న ఈ పంటపై జిల్లా రైతులు ఆసక్తి చూపించడమే కాదు.. విస్తారంగా సాగు చేస్తున్నారు.



బుచ్చెయ్యపేటలో కట్టె జనుము పంట..



జనుము విత్తనాలు

సాక్షి, అనకాపల్లి: ఖరీఫ్ వరి పంటలో వరుసగా వస్తున్న నష్టాలు.. రబీ అపరాల పంటలకు చీడ పురుగుల బెడద.. వెరసి తీవ్రనష్టాలను మూటగట్టుకుంటున్న జిల్లా రైతులకు కట్టె జనుము లాభదాయకంగా మారింది. పైసా పెట్టుబడి లేకుండా.. ఎటువంటి ఎరువులు వాడకుండా, రూ.వేల లాభాన్ని ఆర్జించి పెడుతుంది. గ్రామాల్లో ఎటు చూసినా పసుపు పచ్చగా.. ఆకర్షణీయంగా కనిపించే జనుము పంట జిల్లాలో వివిధ మండలాల్లో 10 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రబీ సీజన్‌లో నువ్వులు, అపరాలతో పాటు ఈ పంట వేస్తుంటారు. కట్టె జనుము ఫ్యాబేసీ కుటుంబానికి చెందిన ఈ మొక్క పంట వల్ల భూసారం పెరుగుతుంది. రబీలో వేసిన ఈ పంట ఖరీఫ్ సీజన్ నాటికి భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు అందిస్తుంది. ఈ పంటను ప్రస్తుతం ఓ వైపు విత్తనాభివృద్ధికి, మరోవైపు ఆయుర్వేదంలో ఉపయోగపడే హెంప్ ఆయిల్ కింద వినియోగిస్తున్నారు.

భూసారం పెంచుకోవచ్చు

మార్కెట్‌లో ధర బాగుండటంతో, ఎలాంటి పెట్టుబడి లేకుండానే లాభాలను పొందే ఆస్కారం ఉంది. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయి చౌడు శాతం పెరిగిపోతోంది. పంటల సాగుకు పనికి రాకుండా పోతోంది. ఎంత పెట్టుబడి పెట్టినా, దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పచ్చిరొట్ట పంటలను పెంచి నేలలో కలియదున్నడం ద్వారా భూసారం పెంచుకోవచ్చు.

కిలో విత్తనాల ధర రూ.80

ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి రావడం, కిలో రూ.80 ధర పలుకుతుంది. ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే కట్టె జనుము సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మోకాలు నొప్పి తగ్గేందుకు..

కట్టెజనుము గింజలు పచ్చిరొట్ట ఎరువుకు ఎంత ఉపయోగమో ఆయుర్వేదంలో మోకాలు నొప్పి తగ్గేందుకు కూడా హెంప్ ఆయిల్‌గా తయారు చేసి వినియోగిస్తున్నారు. అందువల్లే ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కట్టె జనుము సాగుకు గ్లోబల్ ఇండికేషన్‌గా గుర్తింపు పొందే పరిస్థితి తీసుకువచ్చింది. ఇక్కడ నుంచి ఒడిశాకు ఎగుమతి అవుతున్నాయి.

ఒడిశాకు ఎగుమతి..

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లాలో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా తర్వాత అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా పండిస్తున్నారు. ఈ విత్తనాలను ఇక్కడ నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేస్తున్నారు.

చీడపీడల ప్రభావంతో కట్టె జనుము సాగుపై ఆసక్తి..

రబీ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా నువ్వులు, అపరాల పంటలు వేస్తుంటారు. వీటికి చీడపీడలు బెడద ఎక్కువ కావడం, పెట్టుబడి అధికం కావడంతో కట్టె జనుము సాగుపై వైపు రైతులు మళ్లుతున్నారు. పొలం గట్లపైనా సాగు చేస్తుంటారు.

సాగు లాభదాయకం..

కట్టెజనుము సాగు రైతుకు లాభదాయకంగా ఉంది. రబీ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా నువ్వులు పంట వేస్తున్నారు. వాటి తర్వాత పెసర, మినుప, పిల్లి పెసర, బొబ్బరి వంటి అపరాల పంట వేస్తున్నారు. ఈ పంటల కంటే ఎక్కువ ఆదాయం వస్తోండటంతో రైతులు కట్టె జనుము సాగువైపు దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో పాటు అధిక ఆదాయం ఆర్జించే అవకాశాలున్నాయి. అంతేకాకుండా ఈ పంటతో భూసారవంతం పెరుగుతోంది.

– డాక్టర్ మోహన్‌రావు, అగ్రికల్చర్ జేడీ

పీఎం ఇంటర్న్‌షిప్‌కు నేడు తుది గడువు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల:

పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి మంగళవారం లోగా నిరుద్యోగులు నమోదు చేసుకోవాలని ఎం.జాహ్నవి తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధ్యమైనంత ఎక్కువ మంది యువత ఈ పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఇంటర్న్‌కు 12 మాసాల పాటు శిక్షణ ఇస్తూ, నెలవారీ సహాయం కింద రూ.4,500 పరిశ్రమల ద్వారా రూ.500, సంఘటనల కోసం రూ.6 వేలు వన్-టైమ్ గ్రాంట్ మంజూరు చేస్తామన్నారు. శిక్షణ కాలంలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద బీమా కవరేజీ వర్తిస్తుందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ అనంతరం ప్రతిష్టాత్మకమైన కంపెనీల్లో ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం రాత్రి లోపు httpr://pminternship.mca.gov.in/login/ లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ వంటి డిగ్రీలు పూర్తి చేసిన 21 నుంచి 24 సంవత్సరాలలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9010793492కు సంప్రదించవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

ఉచిత సిలెండర్లకు అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

తుమ్మపాల: దీపం–2 ఉచిత గ్యాస్ పథకం కింద అందిస్తున్న సిలెండర్లకు లబ్ధిదారుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ ఎం.జాహ్నవి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. నిర్దేశించిన ధరల ప్రకారం 15 కిలోమీటర్ల పరిధిలో గ్యాస్ డెలివరీ ఉచితంగాను, 15 కిలో మీటర్ల పరిధి దాటితే రూ.30 మాత్రమే వినియోగదారులు చెల్లించాలన్నారు. బిల్లుకు అదనంగా కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్‌లు నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. గ్యాస్ పంపిణీదారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రాంతీయ సేల్స్ అధికారులతో సమావేశం నిర్వహించి, లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువైతే గ్యాస్ ఏజెన్సీలపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. అదనపు వసూళ్లపై పౌర సరఫరాల విభాగం టోల్ ఫ్రీ నెం. 1967కు, ఆయిల్ కంపెనీల ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెం.1800 2333555 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని జేసీ తెలిపారు. పీజీఆర్ఎస్ కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

శత జయంతి ఉత్సవాలకు ఆహ్వానం



స్వామికి ఆహ్వానపత్రం అందిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

సీతంపేట (విశాఖ): అనకాపల్లిలో గల శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో వచ్చే నెల 4 నుంచి 8 వరకు నిర్వహించనున్న ప్రతిష్ఠ, శత జయంతి మహా కుంభాభిషేక మహోత్సవాలకు శ్రీలలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీస్వామికి ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం అందజేసింది. సోమవారం పీఠంలో ఉన్న స్వామి వారిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. 8న జరగనున్న మహాకుంభాభిషేకంలో పాల్గొంటానని ఆలయ ప్రతినిధులకు దత్తేశ్వరానంద భారతీ స్వామి తెలిపారు.

పాఠశాల విద్యలో మార్పులపై సమీక్ష

విశాఖ విద్య : పాఠశాల విద్యలో తీసుకొస్తున్న సమూల మార్పులపై ఆ శాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో సోమవారం జరిగిన వర్క్‌షాప్‌నకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల కలెక్టర్లు హరేందిర ప్రసాద్, విజయకృష్ణన్, దినేష్ కుమార్, అంబేడ్కర్‌తో పాటు, విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్, నాలుగు జిల్లాల డీఈవోలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా మోడల్ స్కూళ్ల ఏర్పాట్లు, క్లస్టర్ విధానం అమలు, యూపీ స్కూళ్లను సమీప హైస్కూళ్లలో విలీనానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో దీనిపై అవగాహన కల్పించేలా వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వీటిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ వర్క్‌షాప్ వివరాలను బయటకు తెలియనీయకుండా అత్యంత గోప్యత పాటించటం గమనార్హం.

ఐక్యతకు చిహ్నం.. దేశ నాయకుల తీర్థాలు



పాల సొసైటీ వద్ద ఉన్న అల్లూరి విగ్రహం



పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం



గాంధీ వీధిలోని జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం



ప్రధాన కూడలిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం



కాలనీలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం

- ఆదర్శంగా నిలుస్తున్న కె.జె.పురం గ్రామస్తులు
- దేశ నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు
- గ్రామంలో వీధులకు సైతం నాయకుల పేర్లు

మాడుగుల రూరల్: మేజర్ పంచాయతీ కె.జె.పురం గ్రామస్తులు, యువకులు తమ ఐక్యతను చాటుకుంటున్నారు. గ్రామంలో దేశ నాయకుల తీర్థాలు ఏటా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దేవతామూర్తులు, అమ్మవార్లకు తీర్థాలు నిర్వహించడం ఆనవాయితీ. సంక్రాంతి పండగ నుంచి గ్రామాల్లో తీర్థాల సందడి ఉంటుంది. అయితే కె.జె.పురంలో అమ్మవార్లు, దేవతామూర్తులతో పాటు దేశ నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు నిర్వహిస్తూ తమ దేశభక్తిని ప్రదర్శిస్తున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఆజాద్ సుభాష్ చంద్రబోస్, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, తదితర నేతల విగ్రహాలను గ్రామంలో ప్రతిష్ఠించారు.

అలాగే ఆ నాయకుల పేరుతో వీధులకు నామకరణం కూడా చేశారు. గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను గ్రామ తొలి సర్పంచ్ దివంగత పాలకుర్తి శ్రీరామమూర్తి 1957 సంవత్సరంలో విజయవాడ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఈ విగ్రహాలకు తీర్థాలు నిర్వహించడం ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి అతికంశెట్టి సింహాచలం తయారు చేయించి పాల సొసైటీ వద్ద ప్రతిష్ఠించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ముకుందపురం మాజీ సర్పంచ్ కర్రి శ్రీరామమూర్తి సహకారంతో కాలనీలో ఏర్పాటు చేశారు.

- గాంధీ తీర్థం ప్రతి ఏటా ఆయన వర్ధంతి మరుసటి రోజు జనవరి 31న గాంధీ వీధి ప్రజలు నిర్వహిస్తుంటారు.
- సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 23న స్థానిక నేతాజీ సోల్జర్స్ యూత్ సారథ్యంలో తీర్థం నిర్వహించనున్నారు.
- నెహ్రూ తీర్థం ప్రతి ఏటా ఫిబ్రవరి 8న నెహ్రూ వీధిలో నిర్వహించనున్నారు.
- గ్రామంలో అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14న పండగలా నిర్వహించి, పలు క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తుంటారు.
- అల్లూరి సీతారామరాజు జయంతి జూలై 4న జరుపుతారు. వీరితో పాటు దివంగత మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల జయంతి, వర్ధంతులను కూడా నిర్వహిస్తున్నారు.

ఆ ఘనత శ్రీరామమూర్తిదే



దివంగత మాజీ సర్పంచ్ పాలకుర్తి శ్రీరామమూర్తి కృషితో దేశ నాయకుల విగ్రహాలను గ్రామంలో 1957లో ప్రతిష్ఠించాం. అప్పటి నుంచి దేశ నాయకుల తీర్థాలు నిర్వహించడం కె.జె.పురంలో ఆనవాయితీగా వస్తోంది. తీర్థాలు, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను గ్రామస్తులంతా ఐకమత్యంతో నిర్వహిస్తున్నాం.

– పుట్టా వెంకట రామ అప్పారావు, కె.జె.పురం, మాడుగుల మండలం

వీధుల పేర్లు బాగున్నాయి..



చిన్నప్పటి నుంచి దేశ నాయకుల విగ్రహాలకు తీర్థాలు నిర్వహించడం చూస్తున్నా. వీధులకు నాయకుల పేర్లు పెట్టారు. పిలవడానికి చాలా బాటుంటుంది. పోస్టల్ అడ్రస్‌లో గాంధీ వీధి, నెహ్రూ వీధి అన్న పేర్లతో పిలుస్తున్నారు. పాలకుర్తి శ్రీరామమూర్తి కృషితో ఇదంతా జరిగింది.

– కచ్చా వెంకటరమణ, కె.జె.పురం, మాడుగుల మండలం

అందరి సహకారంతో సంపూర్ణ అక్షరాస్యత



సంపూర్ణ అక్షరాస్యత పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: సంపూర్ణ అక్షరాస్యతకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వయోజన విద్యా వాచకములు, వలంటరీ మార్గదర్శకాలు పుస్తకాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోజన విద్యాశాఖ అమలు చేస్తున్న ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం ద్వారా గుర్తించిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలన్నారు. జిల్లాలో మొదటి దశలో 11,900 మంది అభ్యాసకులను, 1,190 మంది వలంటీర్లను గుర్తించామన్నారు. జిల్లా స్థాయిలో మండల అభివృద్ధి అధికారులు, ఏపీఎంలకు రెండు దశల శిక్షణ పూర్తి చేశామన్నారు. మండల స్థాయిలో వలంటరీ టీచర్లకు ఒక దశ శిక్షణ పూర్తి చేసి, రెండో దశ ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. వయోజన విద్యా తరగతుల నిర్వహణకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, సామాజిక భవనాలను వినియోగించుకోవచ్చునని సూచించారు. అన్ని మండలాలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి, వెంటనే తరగతులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, వయోజన విద్యాశాఖ సహాయ సంచాలకుడు డి.చిన్నికృష్ణ, డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఎస్.మంజులవాణి పాల్గొన్నారు.

- లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్సీడీసీ)–2025 పోస్టరును కలెక్టర్ విజయ కృష్ణన్ విడుదల చేశారు. వచ్చే నెల 2వ తేదీ వరకు 14 రోజుల పాటు జరగనున్న ఈ సర్వేలో సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి, ఆయా కుటుంబ సభ్యులను పరీక్షించాలని కలెక్టర్ చెప్పారు. అనుమానిత కేసులను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి పంపించాలని సూచించారు. అవసరమైన వారికి చికిత్స అందించాలన్నారు.

అశోక్‌నగర్ స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్

తాటిచెట్లపాలెం(విశాఖ): వెస్ట్ సెంట్రల్ రైల్వే, భోపాల్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ స్టేషన్‌లో విశాఖ–భగత్‌కికోటి–విశాఖ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ–భగత్‌కికోటి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 15వ తేదీ వరకు హాల్ట్ అశోక్‌నగర్‌లో హాల్ట్ కల్పిస్తున్నామన్నారు. ఈ రైలు ఆయా రోజుల్లో తెల్లవారు 4.28 గంటలకు అశోక్‌నగర్ చేరుకుని, అక్కడ నుంచి 4.30గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో భగత్‌కి కోటి–విశాఖ(18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 10వ తేదీ వరకు హాల్ట్ సౌకర్యం కల్పించామన్నారు. ఈనెల 25వ తేదీన పొదనూర్‌లో బయల్దేరే పొదనూర్–బరౌని (06055)స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాంచీ డివిజన్‌లో మళ్లించిన మార్గంలో వయా రూర్కెలా, సిని, చందిల్, మూరి, కొట్‌శిల మీదుగా నడుస్తుంది.

గంజాయి కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష

అనకాపల్లి: గంజాయి కేసులో అనకాపల్లి మండలం శారదానగర్‌కు చెందిన బొంది రమేష్‌కు జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య ఐదేళ్ల జైలు శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2021 జూన్ 28న శారదానది బ్రిడ్జి వద్ద రెండు కేజీల గంజాయితో రమేష్ పట్టుబడ్డాడు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా, వాదోవాదాలు అనంతరం న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మాధవికి బదిలీ

మహారాణిపేట(విశాఖ): జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.జె.మాధవి బదిలీ అయ్యారు. భీమిలి డీఎల్‌డీవోగా కె.హరిప్రసాద్‌రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఏపీఐఐసీ అనకాపల్లి జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

ఊరెళ్లి వచ్చే సరికి ఇల్లు దోచేశారు...


- రూ.2 లక్షల విలువైన ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరణ




చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ సన్నిబాబు

నక్కపల్లి : స్థానిక దేవుడి మడి వీధిలో ఉన్న ఒక ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలు గుద్దటి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీదేవి ఈనెల 15వ తేదీన అనకాపల్లిలో తన సోదరుడి ఇంటికి వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా బెడ్ రూమ్ తాళాలు పగులగొట్టి గదిలో సూట్‌కేసులో ఉన్న సుమారు రూ.2 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సన్నిబాబు, క్లూస్ టీము సిబ్బంది చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సమీపంలో ఉన్న సీసీ పుటేజీలు కూడా పరిశీలిస్తున్నామన్నారు.

జంగుళూరు జంక్షన్‌లో దొంగ అరెస్ట్





నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ గణేశ్, స్వాధీనం చేసుకున్న బంగారు చైన్

అచ్యుతాపురం: అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా పెంచామని సీఐ గణేశ్ తెలిపారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చోరీ కేసులో నిందితుడైన పూడిమడక శివారు కొండపాలెంకు చెందిన సీహెచ్.గంగరాజు జంగుళూరు జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. సదరు వ్యక్తి నుంచి తులం చైన్, ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఆరా తీయగా చోరీ చేసిన నిజం ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు.

ఎస్పీ కార్యాలయానికి 37 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) 37 అర్జీలు వచ్చాయని అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

కె.కోటపాడు : గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 2022–23, 2023–24కు సంబంధించిన వార్షిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజును అభినందించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు మార్చి నెలాఖరులోగా పూర్తికాని పక్షంలో నిధులు మురిగిపోయే పరిస్థితి ఉందని రాజ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గోకులం షెడ్లు త్వరితగతిన పూర్తి చేపట్టేలా లబ్ధిదారులకు వివరించాలని అన్నారు. పల్లె పండగ నిర్వహణలో భాగంగా మండలంలో రూ.6 కోట్ల 28లక్షలతో చేపట్టిన 51 అభివృద్ధి పనుల పురోగతిని మండల ఇంజినీరింగ్ అధికారి సుమతి వివరించారు. అనంతరం గొందుపాలెం హైస్కూల్‌ను డిప్యూటీ సీఈవో సందర్శించారు. పాఠశాలలో కిచెన్ షెడ్డు మరమ్మతు పనులకు మండల పరిషత్ నుంచి అవసరమైతే నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ వి.కృష్ణ, సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.

25న గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం



ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- 22న కల్యాణం, మధ్యాహ్నం భారీ సారె ఊరేగింపు

అనకాపల్లి: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 25న అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు తెలిపారు. స్థానిక గౌరీ పరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న గౌరీపరమేశ్వరుల వార్షిక కల్యాణం, మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి భారీ సారె ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని 37 భారీ స్టేజ్ ప్రోగ్రాములు, 10 నేలవేషాలు, కోలకత్తా వారిచే భారీ విద్యుత్ అలంకరణ, రాత్రికి పార్కు సెంటర్ వద్ద మందుగుండు సీతారామయ్యగారిచే భారీ బాణసంచా వంటి కార్యక్రమం జరుగుతుందన్నారు. మళ్ల జగన్నాథరావు కల్యాణ మండపంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం అమ్మవారి ఉత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మీనాయుడు, ఉపాధ్యక్షుడు కొణతాల ప్రసాద్, కన్వీనర్ పీవీ రమణ పాల్గొన్నారు.

రగ్బీ క్రీడాకారులకు ఉజ్వల భవిత



రగ్బీ క్రీడాకారులకు షీల్డ్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అచ్యుతాపురం: రగ్బీ క్రీడకు రాష్ట్రంలో మరింత గుర్తింపు లభిస్తుందని, క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అనకాపల్లి రగ్బీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కూండ్రపు విమలనాయుడు తెలిపారు. అచ్యుతాపురంలోని డిజిటల్ లైబ్రరీలో సోమవారం జిల్లా స్థాయి రగ్బీ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది విడుదల చేసిన స్పోర్ట్స్ జీవోలో రాష్ట్ర ప్రభుత్వం రగ్బీని 'ఏ'కేటగిరీలో చేర్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే ఉద్యోగాల్లో రగ్బీ క్రీడాకారులకు రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు.

జిల్లా స్థాయి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఈ సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనకాపల్లి జిల్లా రగ్బీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షునిగా కూండ్రపు విమలనాయుడు, అధ్యక్షుడిగా ఎస్.ఎస్.వి.జగదీశ్, ఉపాధ్యక్షుడిగా రెడ్డి చిరంజీవి, సంయుక్త కార్యదర్శిగా సుధీర్, నిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ వెంకట్, కార్యదర్శిగా నాగ వెంకట్, కోశాధికారిగా రమేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా శివాజీ, సభ్యునిగా దేవత రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుండెపోటుతో 'సాక్షి' ఉద్యోగి మృతి



శేషాచలపతిరావు (ఫైల్)

ఖైరతాబాద్(హైదరాబాద్): గుండెపోటుతో సాక్షి దినపత్రికలో పనిచేస్తున్న ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా యలమంచిలి ప్రాంతానికి చెందిన పి.శేషాచలపతిరావు(55) కుటుంబ సమేతంగా హైదరాబాద్ నగరానికి విచ్చేసి అల్వాల్‌లో నివాసముంటూ బంజారాహిల్స్‌లోని సాక్షి దినపత్రిక కార్యాలయంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురికావడంతో బస్టాప్‌లోని ఫుట్‌పాత్‌పై పడిపోయాడు. అచేతనంగా పడి ఉన్న ఆయనను ప్రయాణికులు గమనించి 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఎస్ఐ అమర్‌నాథ్, ఏఎస్ఐ శ్రీరాములు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. వివరాల కోసం ఆరా తీయగా బ్యాగులో సాక్షి దినపత్రిక ఐడీ కార్డు, బస్ పాస్ లభించాయి. దీంతో కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి, వారంతా వైజాగ్‌కు వెళ్లినట్లు తెలుసుకొని భార్య, బావమరిది, వదినకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఐఎంయూ వద్ద కొనసాగుతున్న నిర్వాసితుల ఆందోళన



వర్సిటీ వద్ద మోహరించిన పోలీసులు



విశ్వవిద్యాలయం ఎదురుగా నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు, నిర్వాసిత రైతులు

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో ఉన్న ఇండియన్ మారిటైం విశ్వవిద్యాలయంలో స్థానికులకు, భూ నిర్వాసిత రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజు సోమవారం కొనసాగింది. భూ నిర్వాసిత రైతులు, వంగలి గ్రామస్తులు తమ డిమాండ్లకు సాధనకు విశ్వవిద్యాలయం ఎదుట శనివారం ధర్నా, రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనకారులకు, యాజమాన్యం మధ్య చర్చలు విఫలమవడంతో నిరసన కొనసాగిస్తున్నారు. మూడోరోజు సోమవారం రైతులు, గ్రామస్తులు సుమారు 500 మంది వరకూ దీక్ష స్థలికి చేరుకొన్నారు. యథావిధిగా దీక్షను కొనసాగిస్తుండడంతో విశ్వవిద్యాలయంలో కార్యకలాపాలు కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

ఇదిలావుండగా పెందుర్తిలోని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సమక్షంలో గ్రామస్తులు, విశ్వవిద్యాలయం ప్రతినిధులతో చర్చలు జరిగాయని ప్రచారం జరుగుతోంది. కొన్ని డిమాండ్లను అంగీకరించినప్పటికీ లిఖిత పూర్వకంగా హామీ లభించకపోవడంతో ఆందోళన కొనసాగించేందుకు గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. రైతులు పెద్ద ఎత్తున ప్లకార్డులతో నినాదాలు చేశారు. మూడో రోజు ఆందోళనలో సర్పంచ్ ఆకుల శ్రీహేమతో పాటు నాయకులు ఆకుల గణేష్, జెట్టి ప్రసాద్, జెట్టి ముత్యాలనాయుడు, గొర్లి అప్పలనాయుడు, జెట్టి శ్రీను,జెట్టి నరసింగరరావు,గవర అప్పలనాయుడు,ముమ్మణ అప్పలరాజు,యర్ర సతీష్, గవర గాయిత్రీ, జెట్టి హేమంత్, కోన కొండబాబు, జెట్టి సోమేష్‌తో పాటు భూ నిర్వాసిత రైతులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తహసీల్దార్ చిన్నికృష్ణ, సీఐ రమణ సోమవారం వర్సిటీ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్తులు, నిర్వాసితుల డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని తహసీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు. సీఐ రమణ మాట్లాడుతూ వర్సిటీ వద్ద తనతో పాటు మరో సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ దివ్యతో పాటు 20 మంది వరకూ ఆర్మ్‌డ్ ఫోర్స్, మరో 25 మంది వరకూ సివిల్ ఫోర్స్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

4న రాజుపాలెంలో రథసప్తమి వేడుకలు



రథసప్తమి వేడుకలు గోడపత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలో రాజుపాలెం గ్రామంలో వచ్చే నెల 4న జరిగే సూర్యనారాయణస్వామి రథసప్తమి మహోత్సవానికి సంబంధించి స్థానిక రింగ్‌రోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ రథసప్తమి వేడుకలకు సుమారుగా జిల్లాలో వివిధ గ్రామాల నుంచి లక్షమంది భక్తులు హాజరవుతారన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

అల్వార్‌దాస్‌కు ఘన నివాళి



అల్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైద్యుడు నాయుడు

అనకాపల్లి: స్థానిక నర్సింగరావుపేట దుర్గాలాడ్జీ వీధిలోని వెంకటేశ్వర నర్సింగ్‌హోమ్‌లో వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు సుంకరి అల్వార్‌దాస్ 22వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నర్సింగ్‌హోమ్ వ్యవస్థాపకుడు డి.డి. నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్వార్‌దాస సేవలను కొనియాడారు. మారుతున్న జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఇందుకోసం నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేయాలన్నారు. జంక్‌ఫుడ్స్ వంటి చిరుతిళ్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రాపేటి నారాయణరావు, సభ్యులు కె.వీరభద్రరావు, ఆదారి శ్రీనివాస్, కాండ్రేగుల అప్పారావు, కె.వి.వి.సత్యనారాయణ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 5,583 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,150	5,400
మొదటి రకం	3,530	4.150
రెండో రకం	3,070	3,520
మూడోరకం	2,800	3,060

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	: సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజర్	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	: వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	: శ్రీసత్య
డాకు మహారాజ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 423 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 365 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

డీసీఎంఎస్ @ పెట్రోలు బంకు

చెట్ల తొలగింపు

పెట్రోల్ బంక్ నిర్మిస్తున్న ఖాళీ స్థలంలో ఒక పెద్ద రావిచెట్టు, మూడు చిన్నపాటి టేకు మొక్కలు తొలగించారు. వీటిని ప్రభుత్వ ఆదేశాలు మేరకు రూ.52 వేలకు విక్రయించారు. ఈ సొమ్మును డీసీఎంఎస్ ఖాతాలో ఇక్కడ అధికారులు జమ చేశారు.

- సంస్థ ఆవరణలో బంక్ నిర్మాణ పనులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో తీర్మానం. నేడు కదలిక
- ఉగాది నుంచి వాహనదారులకు పెట్రోల్ సౌకర్యం



డీసీఎంఎస్ ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం తొలగించిన రావిచెట్టు



డీసీఎంఎస్ ఆవరణలో పెట్రోల్ బంక్ పనులు

అనకాపల్లి: డీసీఎంఎస్(జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ) కొత్తగా పెట్రోలు రంగంలోకి అడుగు పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానం సమీపంలో డీసీఎంఎస్ ఖాళీ స్థలంలో పెట్రోల్ బంక్, కల్యాణ మండపం నిర్మాణానికి అప్పటి పాలక వర్గ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించింది. నేటి పాలనలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి.

మిగిలిన స్థలంపై ప్రభుత్వానికి నివేదిక....

డీసీఎంఎస్ మిగిలిన ఖాళీ స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మించడానికి మరోసారి డీసీఎంఎస్ అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ శిథిలావస్థ భవనంలో ఇక్కడ పాములు, క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి. దాంతో ఉద్యోగులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ స్థలంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

25 సంవత్సరాల క్రితం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో రైతుల ఎరువులు, పప్పుదినుసులు, విద్యార్థుల పుస్తకాలు, ధాన్యం నిల్వ భవనాలు ఉండేవి. రానురాను ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. సొసైటీకి ఉన్న ఎకరా 20 సెంట్ల స్థలం నిరుపయోగంగా ఉండడంతో పెట్రోల్ బంక్, కల్యాణ మండపం నిర్మాణ నిమిత్తం వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి పాలక వర్గం ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రస్తుత డీసీఎంఎస్ చైర్మన్, విశాఖ జేసీ కె.మయూరి అశోక్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించింది. మొదటిగా విశాఖ హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో 20 సెంట్ల స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

హెచ్‌పీసీఎల్, డీసీఎంఎస్ సారథ్యంలో ఏర్పాటు...

పట్టణ నడిబొడ్డున పెట్రోల్‌బంకు ఏర్పాటు చేసినట్లయితే ఇక్కడ ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది. డీసీఎంఎస్ చుట్టూ ఎన్టీఆర్ ఆస్పత్రి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్టీఆర్ క్రీడా మైదానం, కూరగాయలు, అరటిపండ్ల మార్కెట్ ఉన్నాయి. హెచ్‌పీసీఎల్, డీసీఎంఎస్ సారథ్యంలో బంక్ నిర్మాణానికి బ్యాంకు ద్వారా కొంత నగదు తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. మార్చిలోగా పూర్తి చేసి ఉగాదికి వాహనదారులకు పెట్రోలు సరఫరా సౌకర్యం కల్పించనున్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటు మంచి నిర్ణయం



పట్టణ నడిబొడ్డున పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు ఉపయోగపడుతుంది. గ్రామాల్లో నుంచి రాత్రిళ్లు మార్కెట్ వచ్చే సమయంలో దగ్గరలో పెట్రోల్ బంక్ లేకపోవడంతో ఊరు చివరకు వెళ్లేవారు. ఇప్పుడు అటువంటి సమస్య రాదు. కూరగాయల మార్కెట్ వద్ద డీసీఎంఎస్‌కు మరో ఖాళీ స్థలం ఉంది. దీనిని అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోనికి తీసుకురావాలి.

– పి. ఓం నమఃశివాయ, అనకాపల్లి

పెట్రోల్ బంక్ పనులు జరుగుతున్నాయి

మూడు మాసాల క్రితం విశాఖ నుంచి అనకాపల్లి డీసీఎంఎస్‌కు వచ్చి ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాను, ప్రభుత్వ ఆదేశాలు మేరకు పెట్రోల్ బంక్ నిర్మిస్తున్నాం. ప్రైవేట్ వ్యక్తులకు బంక్‌ను ఇవ్వడం జరగదు. హెచ్‌పీసీఎల్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నాం. ఉగాదికి పనులు పూర్తిచేసి వాహనదారులకు అందుబాటులోనికి తీసుకుని వస్తాం. దశలు వారీగా సొసైటీని అభివృద్ధి చేస్తాం. – వి.వి.సత్య కుమార్, డీసీఎంఎస్, బిజినెస్ మేనేజర్, అనకాపల్లి

గుల్లాట ఆడిస్తున్న ఇద్దరిపై కేసు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నెంబర్ పట్టా

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో గుల్లాట ఆడిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు సోమవారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గుల్లాట స్థావరంపై దాడి చేసి 6 గుళ్లు, నెంబర్ పట్టా, రూ.1,550 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది దాడులు చేశారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

15 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని, 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వైఎల్ నాయుడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పిల్లి తలుపులును అరెస్టు చేసి ఎక్సైజ్ కోర్టులో హాజరు పర్చామన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు తమకు అందిన సమాచారంపై ఈ దాడి చేశామన్నారు.

తాళ్లపాలెంలో వైభవంగా సీతారాముల తీర్థం



తాళ్లపాలెంలో తీర్థ మహోత్సవం



ఆకాశ చక్రంపై తిరుగాడుతున్న యువత



రంగుల రాట్నంపై తిరుగుతున్న పిల్లలు



వస్తువుల కొనుగోలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో సీతారాముల తీర్థం సోమవారం సాయంత్రం వైభవంగా మండలంలో అతి పెద్ద తీర్థం కావడంతో జనం పోటెత్తారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సవానికి తరలివచ్చారు. ఆద్యంతం ఆనందోత్సాహంతో గడిపారు. ఉత్సవం సందర్భంగా సీతారాముల ఆలయాన్ని భక్తులు ఎక్కువ మంది దర్శించి పూజలు చేశారు. రంగుల రాట్నాలు, ఆకాశ చక్రాలపై పిల్లలతోపాటు పెద్దలు ఉత్సాహంగా తిరుగాడారు. పంచదార చిలుకలు, పిండి వంటలు, స్వీట్లు, ఇతర తినుబండారాలు, కూరగాయల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. ఆట వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, ఇళ్లలో సామాన్లు తదితర అమ్మకాలు ఎక్కువగా జరిగాయి. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆహూతులను ఆకట్టుకుంది. రామాలయ సెట్టింగ్, విద్యుద్దీపాలతో దేవతామూర్తుల కటౌట్లు అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. తాళ్లపాలెం కూడలి నుంచి నర్సీపట్నం రోడ్డులో నిర్వహించిన తీర్థం వల్ల వాహనాల రాకపోలకు అంతరాయం కలగకుండా సీఐ అల్లు స్వామినాయుడు పర్యవేక్షణలో సిబ్బంది చర్యలు చేపట్టారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



రామాలయ సెట్టింగ్



సీతారామాలయంలో నిర్వహిస్తున్న పూజలు



జంప్ చేస్తున్న చిన్నారులు

పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం



వెదురుపర్తిలో గర్భకోశ పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి అల్ఫోన్స్ జార్జ్



పాడి రైతులకు పెయ్యిలకు నట్టల నివారణ మందుల పంపిణీ

కశింకోట: మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రెండు గ్రామాల్లో వీటిని నిర్వహించారు. ఈ నెలాఖరువు వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద జరగనున్న శిబిరాలను మొదటి రోజు వెదురుపర్తి రైతు సేవా కేంద్రం, చింతలపాలెంలో నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అనకాపల్లి సహాయ సంచాలకురాలు బి. సౌజన్య పర్యవేక్షించారు. వెదురుపర్తి శిబిరంలో కశింకోట పశు వైద్యాధికారి అల్ఫోన్స్ జార్జ్ 34 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 50 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఏడీ సౌజన్య మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాల్లో పెయ్యిలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, టీకాలు వేస్తామన్నారు. ఎదకు రాని పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల వారీగా నిర్దేశించిన షెడ్యూలు మేరకు జరిగే శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ శనివాడ అరుణ, ఉప సర్పంచ్ అల్లవరపు కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు కొత్తెం రాము, ఎంపీటీపీ మాజీ సభ్యుడు పందల ఎల్లయ్యనాయుడు, కూటమి నాయకులు సగరపు సన్యాసినాయుడు, కాండ్రేగుల వెంకటరమణ, కుకల వెంకటరమణ, మదిని రాజానాయుడు, కంఠంరెడ్డి ఈశ్వరరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పశు సంవర్ధక శాఖ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. చింతలపాలెంలో పశు వైద్యాధికారి చైతన్యమణి ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి 42 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 20 గొర్రెలు, మేకలు, పెయ్యిలకు నట్టల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది, కూటమి ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ నెలాఖరు వరకు ఉచిత పశువైద్య శిబిరాలు

అనకాపల్లి: గ్రామాల్లో ఈనెల 31వ తేదీ వరకూ పశువులకు ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశు వైద్య శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య అన్నారు. మండలంలో పిసినికాడలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పశువులు వ్యాధులు బారిన పడకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో 65 పశువులకు, దూడ పెయ్యలకు నట్టల నివారణ మందులు ఇవ్వడం జరిగిందన్నారు. 15 పశువులకు గర్భకోశ వ్యాధులకు ఉచితంగా చికిత్సలు చేయడం జరిగిందన్నారు. అంతకుముందు పశువులకు వ్యాధి నివారణ పరీక్షలు చేశారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యుడు అనిల్‌కుమార్, సిబ్బంది కుమారి, కిరణ్, సంతోష్, కావ్య, రాము పాల్గొన్నారు.



చింతలపాలెంలో గర్భకోశ పరీక్షలు చేస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య

'భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇప్పించండి'

మహారాణిపేట/పెందుర్తి: జాతీయ రహదారి విస్తరణలో భూమిని కొల్పోయిన తనకు నష్టపరిహారం ఇప్పించాలని పెందుర్తి మండలానికి చెందిన శరగడం అప్పారావు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో పెందుర్తి గ్రామానికి చెందిన శరగడం అప్పారావు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ పెందుర్తి మండలం పెందుర్తి గ్రామం సర్వే నెం.164, 164/2, 164/6, 164/4, 164/పిలో 34 సెంట్ల భూమి పోయిందని, ఇప్పటి వరకు ఆ భూమికి నష్టపరిహారం ఇవ్వలేదని మొరపెట్టుకున్నారు. పిల్లల చదువులు, పెళ్లి కోసం డబ్బులు అవసరం కాగా, దీనికి సంబంధించిన పరిహారం మొత్తం న్యాయస్థానంలో జమ చేశారని, దానిని తాము తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోయారు. నిర్వాసితులు అందరికి కలిపి మొత్తంగా పరిహారం జమ చేయడం వల్ల ఒక్కరుగా తీసుకోలేని పరిస్థితి ఉందని, ఇందులో ఎవరికి ఎంత పరిహారం వస్తుందో తెలియట్లేదన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని భూమి కొల్పోయిన బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అప్పారావు తన వినతి పత్రంలో కోరారు.



పరిహారం కోసం కలెక్టర్‌ను ఆశ్రయించిన అప్పారావు

అసంపూర్తి సీసీ కాలువతో ఇబ్బందులు



దేశపాత్రునిపాలెంలో సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టాల్సిన మురుగు కాలువ

పరవాడ: దేశపాత్రునిపాలెం మెయిన్‌రోడ్డులో అసంపూర్తిగా నిలిచిపోయిన సీసీ కాలువలో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేశపాత్రునిపాలెం నుంచి మెయిన్ రోడ్డును ఆనుకుని జాజులవానిపాలెం ప్రధాన కాలువ వరకు సీసీ కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీన్ని వార్డు సచివాలయం-1 వరకు నిర్మించి వదిలేశారు. దీంతో గ్రామం నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు సచివాలయం వరకు వచ్చి అక్కడి నుంచి మట్టి కాలువ ద్వారా ప్రవహిస్తుంది. మట్టి కాలువలో పూడికలు పెరిగి, ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరిగి, రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు కోదండ సీతారామస్వామి తీర్థం

అనకాపల్లి: మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో కోదండ సీతారామ స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయన ప్రతినిధులు సాలాపు దేముడునాయడు, తిర్రు ముసిలినాయుడులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీర్థ మహోత్సవం పురస్కరించుకుని ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం నేలవేషాలు, రాత్రికి స్టేజ్ ప్రోగ్రాంలు నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

అప్పన్న సన్నిధిలో లలితాపీఠం ఉత్తరాధికారి



సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని విశాఖలోని లలితా పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సోమవారం దర్శించుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టెన్నికాయిట్‌లో సబ్బవరం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కుమార్‌ను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 41వ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో టెన్త్ చదువుతున్న జి.అసలేష్ కుమార్, బి గ్రీష్మ, బి.సుమంత్ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. అసలేష్ కుమార్ రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొంది, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జ్ హెచ్ఎం పి.రాధాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయ సిబ్బంది, పీఎంసీ చైర్మన్ జి.శంకరరావు, వైస్ చైర్మన్ జి.జ్యోతిశ్రీ తదితరులు అభినందించారు.

మరిడిమాంబ తీర్థంలో ఎడ్ల పోటీలు

మాడుగుల: మండలంలో సత్యవరంలో సోమవారం మరిడిమాంబ తీర్థం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి, ఉప సర్పంచ్ పెంటయ్య పాల్గొన్నారు.



పోటీలో ఉరకలు వేస్తున్న గిత్తలు

భూ వివాదంలో నలుగురిపై కేసు

పరవాడ: తాడి గ్రామ రెవెన్యూ పరిధిలో తన భూమిని ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని విశాఖకు చెందిన ఓ వ్యక్తి పరవాడ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. నగరానికి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు చెందిన ఎస్.రోహిత్ కుమార్‌వర్మకు తాడి రెవెన్యూ పరిధి సర్వే నెం.3/2ఎ సాలాపువానిపాలెం సమీపంలో 3.72 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి తమదంటూ సోమవారం కొంత మంది తన భూమిలో అక్రమంగా చొరబడి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, ఆక్రమించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదానికి సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.